### యౌవ్వనులకు మరియు పెద్దలకు

# మిషను పొలపు వార్తలు

### దక్షిణ ఆసియా-పసిఫిక్ డివిజను



**నాల్గవ త్రిమాసము**

**అక్టోబరు, నవంబరు, డిశంబరు - 2025**

అనువాదం :

**డాఫోడిల్ & ఎమరాల్డ్**



5వ నివేదిక నవంబరు 01, 2025

# నిత్యత్వం కొరకు బోధించుట

**వాషింగ్టన్-బ్రెజిల్**

వాషింగ్టన్ జీవితమంతయూ బ్రెజిల్‌లో ఉన్న నార్త్ ఈస్ట్ బ్రెజిల్ అకాడమీ చుట్టూ తిరుగుతుంది. 1943లో స్థాపించబడిన ఈ అకాడమీ నుండి మొట్టమొదటిగా గ్రాడ్యుయేట్ అయినవారిలో వాషింగ్టన్ తండ్రి ఒకరు. వాషింగ్టన్ అక్కడే జన్మించాడు. చిన్నప్పటి నుండి ఆ అకాడమీలోనే చదువుకోవాలని కలలు గన్నాడు.

అతడు పెద్దవాడయ్యాక, అతని కల నెరవేరింది. అతను ఆ అకాడమీలోనే చదువుకొని, గ్రాడ్యుయేట్ అయిన తరువాత బ్రెజిల్ ప్రభుత్వ టాక్స్ సర్వీసులో ఉద్యోగం లభించింది. అతడు వివాహం చేసుకున్నాడు. తనకు కుమారుడు జన్మించినపుడు, ఆ బాలుడు కూడా అదే అకాడమీలో చదువుతాడని ఆశించాడు.

కానీ 2000వ సంవత్సరంలో ఆ అకాడమీని వరదలు ముంచెత్తి, దానిని నాశనం చేశాయి. వాషింగ్టన్ మరియు అనేకమంది ప్రజలు ఇష్టపడే ఆ అకాడమీ నాశనమయ్యింది.

చాలా సంవత్సరాలు గడిచిపోయాయి. సెవెంత్ డే ఎడ్వెంటిస్టు చర్చి వారు నార్త్ ఈస్ట్ బ్రెజిల్ అకాడమీ స్థానంలో ఒక స్కూల్‌ను ప్రారంభించడానికి భూమిని కొనుగోలు చేశారని వాషింగ్టన్ తెలుసుకున్నాడు. అందుకతడు చాలా సంతోషించాడు. ఆ స్కూలును మరలా తన జీవితంలో భాగం చేసుకోవడానికి, అతడు తన జీవితం మొత్తాన్ని మార్చుకున్నాడు.

ఆ సమయంలో వాషింగ్టన్ 'రెసిఫ్' అనే నగరంలో నివసిస్తున్నాడు. అక్కడి నుండి క్రొత్తగా నిర్మించే స్కూల్‌కు కారులో చాలా గంటలు ప్రయాణం చేయవలసియున్నది. 'రెసిఫ్' నగరంలో అతడు బాగా స్థిరపడ్డాడు. అతనికి అక్కడ అనేక ఇళ్ళు ఉన్నాయి. తన కుటుంబానికి మంచి జీవితాన్ని సమకూర్చాడు. సౌకర్యమైన జీవితాన్ని గడుపుచున్నాడు. అతడు పదవీ విరమణకు సమీపంగా ఉన్నాడు. కానీ వీటన్నిటినీ అతడు పట్టించుకోలేదు. సెవెంత్ డే ఎడ్వెంటిస్ట్‌లు నిర్మిస్తున్న క్రొత్త స్కూల్ ప్రాంతానికి వెళ్ళునట్లు అతడు ప్రార్థించాడు.

తాను పనిచేయుచున్న చోటు నుండి బదిలీ చేయుమని తన అధికారులను వాషింగ్టన్ కోరాడు. బదిలీలు పొందడం అంత సులభం కాదు. కానీ కొన్నిసార్లు పదవీవిరమణ వయస్సుకు దగ్గరగా ఉన్నవారిని బదిలీకి అనుమతిస్తారు.

వాషింగ్టన్ సూపర్‌వైజర్ అతనిని బ్రెజిల్‌లోని మరొక రాష్ట్రానికి బదిలీ అగుటకు ప్రతిపాదించాడు. అందుకు వాషింగ్టన్ అధికారి ప్రతిపాదించిన చోటుకు వెళ్ళడానికి అంగీకరించలేదు. "నేను అక్కడకు వెళ్ళలేను. నేను క్రొత్త సెవెంత్ డే ఎడ్వెంటిస్ట్ స్కూల్ ఉన్న స్థలం దగ్గర నివసించాలనుకుంటున్నాను. విద్య నాలా చాలా ముఖ్యం" అని వాషింగ్టన్ ఆయనతో చెప్పాడు.

అందుకు సూపర్‌వైజర్ ''మీరు నిజంగా అక్కడకు వెళ్ళాలనుకుంటున్నారా?" అని అడిగాడు. "అవును" అని వాషింగ్టన్ చెప్పాడు.

"సరే మీరు కోరినట్లే వెళ్ళండి. పని పూర్తయింది" అని సూపర్‌వైజర్ చెప్పాడు.

ఎంత సులభంగా బదిలీ జరిగింది.

వాషింగ్టన్ బదిలీ పత్రంపై సంతకం చేసి, "ఇప్పుడు మీరు ఎడ్వెంటిస్ట్ స్కూల్ స్థలం దగ్గర పనిచేస్తున్నారు" అని సూపర్‌వైజర్, వాషింగ్టన్‌కు బదిలీ పత్రం అందజేశాడు.

మొదట్లో, వాషింగ్టన్ భార్య మరియు చిన్న కుమారుడు ఈ బదిలీ గురించి సంతోషంగా లేరు. 'రెసిఫ్'లో వారికి జివితం చాలా సౌకర్యంగా ఉన్నది. ఎందుకంటే వారు ఒక పెద్ద షాపింగ్ సెంటర్ దగ్గర నివసించారు. అన్నీ దగ్గరలో అందుబాటులో ఉంటాయి. కానీ ఎడ్వెంటిస్ట్ స్కూల్ ఉన్న ప్రాంతం చుట్టూ అడవులు ఉంటాయి. అయిననూ వాషింగ్టన్ భార్య, చిన్న కుమారుడు అక్కడకు వెళ్ళడానికి అంగీకరించారు.

ఎడ్వెంటిస్ట్ స్కూల్ స్థలం దగ్గర వాషింగ్టన్ భూమిని కొని క్రొత్త ఇల్లు నిర్మించాడు. అతడు 'రెపిఫ్'లో రెండు ఇళ్ళు అమ్మి, ఆ డబ్బును స్కూల్ ప్రాజెక్ట్‌కు విరాళంగా ఇచ్చాడు.

2007వ సంవత్సరంలో ఎడ్వెంటిస్ట్ స్కూల్ నిర్మాణం ప్రారంభమైనప్పుడు, వాషింగ్టన్ నిర్మాణ పనులలో సహాయపడ్డాడు. అతడు నిధుల సేకరణలో నిమగ్నమయ్యాడు. మరియు విద్యార్థులను స్కూల్‌లో చేర్చడంలో సహాయపడ్డాడు. విద్యార్థుల ట్యూషన్ ఫీజు చెల్లించాడు. స్కూల్ యొక్క సహాయపడ్డాడు. విద్యార్థుల ట్యూషన్ ఫీజు చెల్లించాడు. స్కూల్ యొక్క మొదటి ప్రిన్సిపాల్‌కు నివసించడానికి తన ఇల్లు ఇచ్చాడు. తరువాత స్కూల్‌కు సమీపంలో రెండవ ఇంటిని నిర్మించాడు.

అతని సంతోషానికి తగ్గినట్లు, చివరకు 2014లో స్కూల్ ప్రారంభించబడినది. అతని కుమారుడు 'ఇగోర్' ఆ స్కూల్ మొదటి విద్యార్థిగా పేరు నమోదు చేశారు. ఇగోర్‌కు 10 సంవత్సరాల వయస్సు.

నేడు వాషింగ్టన్‌కు 65 సంవత్సరాలు అతడు పదవీ విరమణ చేశాడు. కానీ అతడు ఇప్పటికీ ఎడ్వెంటిస్ట్ స్కూల్‌కు దగ్గరలో ఉన్న టాక్స్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఇగోర్ హైస్కూల్ నుండి గ్రాడ్యుయేట్ అయ్యాడు. ఇప్పుడు యూనివర్సిటీలో చదువుచున్నాడు.

పెర్నాంబుకానో ఎడ్వెంటిస్ట్ అకాడమీ అనే పూర్తి పేరు గల స్కూల్ పట్ల తనకు ఉన్న ప్రేమ గురించి మాట్లాడుతూ వాషింగ్టన్ ఆనందంతో నిండిపోయాడు. తన కుటుంబంలోని మూడు తరాలు అక్కడ చదువుకున్నందుకు మరియు అతని జీవితం ఆ స్కూల్ చుట్టూ తిరుగుతూ ఉండటం పట్ల అతడు సంతోషంగా ఉన్నాడు.

'పెర్నాంబుకానో ఎడ్వెంటిస్ట్ అకాడమీ నిత్యత్వం కొరకు బోధిస్తూ పిల్లలను పరలోక మార్గంలో నడిపిస్తుందని' నేను నమ్ముచున్నాను అని వాషింగ్టన్ చెబుతున్నాడు.

ఈ త్రిమాసము యొక్క 13వ సబ్బాతు కానుకలను, క్వార్టర్లీ మిషన్ ప్రాజెక్ట్ ఆఫరింగ్ అని కూడా పిలుస్తారు. ఈ కానుకలు పెర్నాంబుకానో ఎడ్వెంటిస్ట్ అకాడమీలో 500 మంది కూర్చోవడానికి వీలుగా ఒక పెద్ద చర్చి నిర్మించడానికి సహాయపడతాయి. ఈ ముఖ్యమైన ప్రాజెక్ట్ కొరకు ధారాళముగా కానుకలు సమర్పించుటకు ప్రణాళిక కలిగియున్నందులకు మీకు కృతజ్ఞతలు.

–ఆండ్రూ మెక్ ఛెస్నీ